వీధి కుక్కల బెడద నుంచి రక్షించండి

మణికొండ, జూలై 30: మణికొండ మున్సిపాలిటీ పరిధిలో రోజు రోజుకు వీధి కుక్కల బెడద కారణంగా మహిళలు, చిన్నారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ది సిటిజన్ కౌన్సిల్ సభ్యులు అన్నారు. ఈ మేరకు కౌన్సిల్ ఆధ్వర్యంలో మంగళవారం మణికొండ మున్సిపల్ కమిషనర్ ప్రదీప్‌కుమార్‌ను కలిసి వీధి కుక్కల బెడద నుంచి ప్రజలను రక్షించాలని విన్నవించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. హై కోర్టు ఇచ్చిన డైరెక్షన్ ప్రకారం కుక్కలకు షెల్టర్ హోమ్ ఏర్పాటు చేయాలని ఈ విషయమై కలెక్టర్, సీడీఎంఏ అధికారులను కూడా కలవడం జరిగిందన్నారు. రాబోయే వినాయక చవితి, నవరాత్రి ఉత్సవాలలోపు వాడవాడలా వీధిదీపాలు ఏర్పాటు చేయాలని కోరామన్నారు. ఈ చర్చలలో వైజాగ్ మాజీ మున్సిపల్ కమిషనర్ రమేశ్‌తో పాటు మున్సిపల్ కౌన్సిలర్లు వసంత్‌రావు చౌహాన్, బిట్టు పద్మారావు, నవీన్‌కుమార్, శ్రీకాంత్‌స్వామి, ది సిటిజన్స్ కౌన్సిల్ కార్యదర్శి షేక్ ఆరీఫ్ మొహమ్మద్, ఉపాధ్యక్షులు అందె లక్ష్మణ్‌రావు, ఉపకార్యదర్శి ఉపేందర్‌నాథ్‌రెడ్డి, కోశాధికారి దిలీప్ కక్కడ్, సభ్యులు శ్రీధర్‌గుప్తా, డాక్టర్ జమ్మీర్, ఫైజల్, జియా, అఖిల్, వైఎస్ఆర్ కాలనీ, పంచవటి కాలనీవాసులు, బాపు హిల్స్ కాలనీ వాసులు పాల్గొన్నారు.

ట్యాక్స్ అసెస్‌మెంట్‌పై అవగాహన

జూబ్లీహిల్స్,జూలై 30 : రహ్మత్‌నగర్ డివిజన్‌లో కేంద్ర ప్రభుత్వ స్థలాల్లో ఉన్న నివాసాలను ప్రత్యేకంగా పరిగణించి ఆస్తిపన్ను మదింపు చేపట్టాలని కార్పొరేటర్ సీఎన్ రెడ్డి కోరారు. మంగళవారం జీహెచ్ఎంసీ అధికారులతో సమావేశం నిర్వహించి ట్యాక్స్ అసెస్‌మెంట్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ మేరకు డిప్యూటీ కమిషనర్‌కు వినతి పత్రం అందజేయనున్నట్లు తెలిపారు. సంబంధిత ప్రతిని ఎంసీ బాలరాజ్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్ ధన్‌రాజు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు ప్రతి ఒక్కరూ సహకరించాలి

కౌన్సిల్ సమావేశంలో మేయర్ లతాప్రేమ్‌గౌడ్, డిప్యూటీ మేయర్ రాజేంద్రర్‌రెడ్డి

బండ్లగూడ,జూలై 30: అభివృద్ధి పనులకు ప్రతి ఒక్కరూ సహకరించాలని మేయర్ లతా ప్రేమ్‌గౌడ్ అన్నారు. బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సాధారణ కౌన్సిల్ సమావేశం మంగళవారం మేయర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కార్పొరేషన్ పరిధిలో సీసీ రోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీలు, బీబీ రోడ్లు తదితర అభివృద్ధి పనులకు తీర్మానాలు చేశారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ శరత్ చంద్ర, వివిధ విభాగాల అధికారులు, కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీలో ముగిసిన ప్రమాద రహిత వారోత్సవాలు

బండ్లగూడ, జూలై 30: తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఆధ్వర్యంలో జరుగుతున్న ప్రమాద రహిత వారోత్సవాల ముగింపు కార్యక్రమాలను మంగళవారం రాజేంద్రనగర్ ఆర్టీసీ డిపో లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నర్సింహులు ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా కొన్ని సంవత్సరాలుగా రాజేంద్రనగర్ ఆర్టీసీ డిపోలో బస్ డ్రైవర్‌గా పని చేస్తూ ఎలాంటి ప్రమాదాలకు తావు లేకుండా సేవలందించిన వారిని డిపో మేనేజర్ బద్రీనారాయణ, ఇన్‌స్పెక్టర్ నర్సింహులు సన్మానించారు. అనంతరం ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ.. డ్రైవింగ్‌లో ప్రతి డ్రైవర్ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ రవికుమార్, మోకానిక్ ఇంజినీర్ నీలిమ, ఎస్‌టీఐ సుశీల, తదితరులు పాల్గొన్నారు.

ఆరాంఘర్ చౌరస్తాలో భారీగా ట్రాఫిక్ జామ్...

వర్షాలకు రోడ్లపై భారీగా మట్టి పేరుకుపోవడంతోపాటు గుంతలు ఏర్పడటంతో ట్రాఫిక్ స్తంభిస్తోంది. దీంతో వాహనదారులు నిత్యం న రకం అనుభవిస్తున్నారు. మట్టి, గుంతలతో మంగళవారం సాయంత్రం ఆరాంఘర్ చౌరస్తా ప్రాంతంలో భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. వాహనదారులు గంటల తరబడి రోడ్డుపైనే ఉన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుపై మట్టి తొలగించి, గుంతలను పూడ్చాలని వాహనదారులు కోరుతున్నారు.

– మైలార్‌దేవ్‌పల్లి, జూలై 30

వైభవంగా ఎల్లమ్మ బోనాల ఉత్సవాలు

శంషాబాద్ మండలంలోని నర్కూడ, చౌదర్‌గూడ, ఘాన్సిమియాగూడ, పెద్దషాపూర్ గ్రామాల్లో మంగళవారం ఎల్లమ్మ తల్లి బోనాల ఉత్సవాలు వైభవంగా జరిగాయి. మహిళలు బోనాలు అమ్మవారికి సమర్పించి మొక్కులు చెల్లించారు. *– శంషాబాద్ రూరల్, జూలై 30*

ఆషాఢ మాసం బోనాల సందర్భంగా మంగళవారం జూబ్లీహిల్స్ డివిజన్, వినాయక్ నగర్‌లో బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. కార్పొరేటర్ వెల్దండ వెంకటేశ్, తదితరులు ఎల్లమ్మ ఈదమ్మ ఆలయంలో అమ్మవారికి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ మెంబర్స్, జూబ్లీహిల్స్ డివిజన్ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, మహిళా సంఘం సభ్యులు, యువజన నాయకులు, భక్తులు, స్థానికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

– జూబ్లీహిల్స్, జూలై 30

దేశ వ్యాప్తంగా నేల కలుషితం..

- పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత మనందరిది..
- సేంద్రియ వ్యవసాయంపై అవగాహన అవసరం
- ప్రొ.జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డా.రఘురామిరెడ్డి



సదస్సును ప్రారంభిస్తున్న రిజిస్ట్రార్ రఘురామిరెడ్డి , తదితరులు

వ్యవసాయ యూనివర్సిటీ, జూలై 30: దేశ వ్యాప్తంగా నేల కల్మశం అవుతుందని, అనేక తప్పుడు కార్యక్రమాల వల్ల నేల, పర్యావరణం కలుషితం అవుతుందని రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ ప్రొ.జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్, డా.రఘురామిరెడ్డి అన్నారు. మంగళవారం విస్తరణ విభాగం ఆడిటోరియంలో దక్షిణ భారత్‌లోని శాస్త్రవేత్తలకు జరిగిన సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రతి ప్రాణికి, ప్రధానంగా మానవుని మనుగడకు నేల ఎంతో అవసరమని, మనం ఎంత కాపాడుకుంటే అంత కంటే మరింత మంచి ఫలితాలిస్తుందని తెలిపారు. కలుషితమైన గాలి, నీరు, ప్లాస్టిక్ అతి ఎక్కువగా నేలను కలుషితం చేస్తుందని గుర్తు చేశారు. సహజ వనరులను విచక్షణా రహితంగా వాడకాన్ని తగ్గించాలని అన్నారు. భావి తరాలకు కాలుష్య రహిత వనరులను అందిస్తూ , ఆహార ధాన్యాల ఉత్పత్తిలో నెలకొన్న స్తబ్ధతను అధిగమించాలన్నారు.

అనంతరం దక్షిణ తెలంగాణ మండల సహ పరిశోధనా సంచాలకులు డా. మల్లారెడ్డి మాట్లాడుతూ.. ప్రస్తుతం పెరుగుతున్న జనాభా, తగ్గుతున్న అటవీ , చెరువు కుంటల సంఖ్య, పొల్యూషన్ తదితరాల వల్ల నేల సారం దెబ్బతింటుందని.. వాటిని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరికి ఉందని గుర్తుచేశారు. మన పరిశోధనలు వేగవంతం చేస్తూ , సేంద్రియ వ్యవసాయంపై గ్రామీణ ప్రాంత రైతులకు , పట్టణ ప్రజలకు ప్లాస్టిక్ భూతం వల్ల కలిగే నష్టంపై అవగాహన కల్పించాలన్నారు. దీర్ఘకాలిక ఎరువుల విధానం, జీవన ఎరువుల సూక్ష్మ పోషకాలు , భూసార పరీక్షల ఆధారంగా ఎరువుల సిఫారస్ , వివిధ అంశాలపై పరిశోధనలు సాగిస్తున్న దక్షిణ రాష్ట్రాలు , రెండు తెలుగు రాష్ట్రాలతోపాటు చత్తీస్‌గఢ్, అఖిల భారత సమన్వయ పరిశోధన, ప్రాజెక్టు పరిశోధన ప్రగతిని సమీక్షించడానికి ఉద్దేశించింది ఈ సదస్సు అని గుర్తు చేశారు. ఈ సదస్సులో జమ్ములోని షేర్ –ఇ– కాశ్మీర్ (యూనివర్సిటీ ఆఫ్ అగ్రికల్చర్ సైన్సెస్ టెక్నాలజీ) మాజీ ఉపకులపతి డా.శర్మ బృందం, భోపాల్ బృందం, భోపాల్‌లోని వివిధ రాష్ట్రాల శాస్త్రవేత్తలు పాల్గొన్నారు. ఈ సదస్సు మరో రెండు రోజులు కొనసాగనుంది.

చలో గాంధీ భవన్ పిలుపు.. ముందస్తు అరెస్టులు

శంషాబాద్ రూరల్, జూలై 30 : తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం ఇస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మ్యానిఫెస్టోలో పెట్టి అధికారంలోకి వచ్చి 8 నెలలు గడుస్తున్నా పట్టించుకోకపోవడంతో తెలంగాణ ఉద్యమకారులు మంగళవారం చలో గాంధీ భవన్‌కు పిలుపునిచ్చారు. దీంతో ప్రభుత్వం.. పోలీసుల చేత ముందస్తు అరెస్టులు చేయించి స్టేషన్‌కు తరలించారు. శంషాబాద్ మండల బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి మంచర్ల మోహన్‌రావు, రాచమల్ల రమేశ్, చిన్నగండు రాజేందర్, జగ్గయ్యలతో పాటు పలువురిని ఉదయం ఇంటి వద్ద అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించి.. సాయంత్రం వదిలిపెట్టారు. దీంతో పాటు ఆశ వర్కర్లు సమస్యలపై సీఐటీయూ ఆధ్వర్యంలో చలో హైదరాబాద్ పిలుపునివ్వగా.. సీఐటీయూ జిల్లా నాయకుడు నీరటి మల్లేశ్‌తో పాటు మండలంలోని ఆశవర్కర్లను అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి అనేక హామీలు ఇచ్చి.. అధికారంలోకి వచ్చిన తర్వాత గాలికి వదిలేశారని ఆవేదన వ్యక్త చేశారు.

అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాలని వినతి..

బండ్లగూడ, జూలై 30 : ప్రభుత్వ స్థలంలో వెలుస్తున్న అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాలని కార్పొరేటర్ సాగర్‌గౌడ్ కోరారు. ఈ మేరకు ఆయన స్థానికులతో కలిసి మంగళవారం గండిపేట మండల తాసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పిరం చెరువు సర్వే నంబర్ 33,34లలో గతంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి కేటాయించారని తెలిపారు. కాగా ప్రస్తుతం కొంత మంది నాయకులు ఆయా సర్వే నంబర్లలో గృహ నిర్మాణాలను చేపడుతూ కబ్జాలకు పాల్పడుతున్నారని వాపోయారు.

బీసీల హక్కుల సాధనకు క్షేత్రస్థాయి కమిటీలు

బీసీ సాధికారిక సంఘం అధ్యక్షుడు ప్రతాని రామకృష్ణ గౌడ్

జూబ్లీహిల్స్, జూలై 30: బీసీల హక్కుల సాధనకు క్షేత్రస్థాయి కమిటీలను సంఘటితం చేయనున్నట్లు తెలంగాణ రాష్ట్ర బీసీ సాధికారిక సంఘం అధ్యక్షుడు ప్రతాని రామకృష్ణ గౌడ్ తెలిపారు. ఫిలింనగర్ కల్చరల్ సెంటర్‌లో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 133 బీసీ కులాల ప్రతినిధులతో మంగళవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. బీసీలను ఒక్కతాటిపైకి తీసుకురావడానికి అన్ని సంఘాలు తమ వంతు కృషి చేయాలన్నారు. బీసీ సంఘాలను బలోపేతం చేసేందుకు గ్రామ, వార్డు స్థాయిలలో కమిటీలు వేయనున్నట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో వివిధ కుల సంఘాల ప్రతినిధులు భాస్కర్ రావు, మహేందర్, చంద్రశేఖర్, వెంకటేశ్, లక్ష్మీ, తిరుమల దేవి, కోల శ్రీనివాస్, రాములు, బాలకృష్ణ, అయ్యావుల రాములు, వీరాంజనేయులు, కాసారం రమేశ్ పటేల్, ఆయా జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

జనాభాకు అనుగుణంగా డ్రైనేజీ వ్యవస్థ ఆధునీకరణ

మణికొండ, జూలై 30: పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా డ్రైనేజీ వ్యవస్థను ఆధునీకరిస్తున్నామని నార్సింగి మున్సిపాలిటీ కౌన్సిలర్ పత్తి శ్రీకాంత్‌రావు అన్నారు. 6వ వార్డులోని ముప్పా రోడ్డులో అండర్ గ్రౌండ్ డ్రైనేజీకి రూ.35లక్షలు మంజూరు కావడంతో మంగళవారం ఆయన ఈ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెరుగుతున్న జనాభాను దృష్టిలో ఉంచుకొని డ్రైనేజీ వ్యవస్థను ఆధునీకరించడం జరుగుతుందన్నారు. ప్రజలు చెత్తాచెదారాలు, వ్యర్థాలను డ్రైనేజీల్లో వేయవద్దని అన్నారు. డ్రైనేజీ రోడ్లపై పొంగిపొర్లితే ప్రజలకు అనేక ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. ప్రజలు వీటన్నింటిని దృష్టిలో ఉంచుకొని బాధ్యతాయుతంగా నడుచుకోవడం ఎంతో ముఖ్యమన్నారు. అనంతరం 6వ వార్డులో చెడిపోయిన మోటార్‌ను ఆయన బాగు చేయించారు. ప్రజలకు నీటివల్ల ఎలాంటి సమస్యలు రావద్దని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో 6వ వార్డు సభ్యులు సుధాకర్‌రెడ్డి, సురేశ్, ప్రేమ్‌కుమార్, డీజే కుమార్, మద్దూరి రాజు, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

వరదముంపు సమస్యలు తలెత్తకుండా చర్యలు..

జూబ్లీహిల్స్, జూలై 30 : వర్షాకాలం వరదముంపు సమస్యలు తలెత్తకుండా నాలాలు, డ్రైన్‌ల పూడికతీత చేపట్టాలని జీహెచ్ ఎంసీ స్టాండింగ్ కమిటీ మెంబర్, యూసుఫ్‌గూడ డివిజన్ కార్పొరేటర్ బండారి రాజ్‌కుమార్ పటేల్ పేర్కొన్నారు. మంగళవారం డివిజన్‌లోని వెంకటగిరిలో పూడికతీత పనులను అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ.. మ్యాన్ హోల్స్ వద్ద చెత్త చేరకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈఈ రాజ్‌కుమార్, ఏఈ భరత్, న్యాక్ ఏఈ వెంకటేశ్, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు సంతోష్ ముదిరాజ్ పాల్గొన్నారు.

ఘనంగా ఘటాల ఊరేగింపు...

మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ బాబుల్‌రెడ్డినగర్‌లో బోనాల ఉత్సవాలను పురస్కరించుకొని మంగళవారం సాయంత్రం ఘటాల ఊరేగింపు, ఫలహారం బండి, ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి హాజరయ్యారు.

– మైలార్‌దేవ్‌పల్లి, జూలై 30

నేడు ఆర్టీసీ డిపోలో డయల్ యువర్ డీఎం

బండ్లగూడ, జూలై 30: రాజేంద్రనగర్ ఆర్టీసీ డిపోలో బుధవారం ఉదయం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మేనేజర్ బద్రీనారాయణ తెలిపారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఈ కార్యక్రమం ఉంటుందన్నారు. ప్రజా రవాణాలో ప్రజలు తమ సూచనలు, సలహాలు ఇవ్వవచ్చని తెలిపారు. ప్రజలు ఈ నంబర్ : 9959226135లో సంప్రదించాలన్నారు.

పర్యావరణవేత్త గంగాధర్ రెడ్డికి డాక్టరేట్

జూబ్లీహిల్స్, జూలై 30: పర్యావరణ పరిరక్షణకు విశేషంగా కృషి చేస్తున్న ప్రముఖ పర్యావరణవేత్త దొంతిరెడ్డి గంగాధర్ రెడ్డిని చికాగో ఓపెన్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్‌తో సత్కరించింది. మురుగునీటి శుద్ధి ప్రక్రియలో శాస్త్రీయ, ప్రకృతి ఆధారిత పరిష్కార పద్ధతులను ఆవిష్కరించిన అంశంపై ఢిల్లీలో జరిగిన కాన్వకేషన్ కార్యక్రమంలో ఈ డాక్టరేట్ పట్టాను అందుకున్నారు. ఈ మేరకు మంగళవారం జూబ్లీహిల్స్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పలువురు ఆయనను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంకోసం ఏదైనా చేయాలన్న తపనతో అమెరికాలో గ్రీన్ కార్డు ఉన్న తాను స్వదేశానికి వచ్చి చెరువులు, కుంటలు, వాగుల్లో కలుషిత నీటితో ప్రకృతికి పొంచిఉన్న ముప్పును గుర్తించి శుద్ధిచేసే విధానాలను అవలంభిస్తున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో తన కృషిని అమెరికాకు చెందిన చికాగో వర్సిటీ గుర్తించి డాక్టరేట్ ఇవ్వడం గర్వంగా ఉందని అన్నారు.

ఆ ఫ్లెక్సీలపై చిన్నచూపేలా..?

జూబ్లీహిల్స్, జూలై 30 : బంజారాహిల్స్ డివిజన్‌లో బోనాల పండుగ సందర్భంగా శుభాకాంక్షలు తెలుపుతూ ఏర్పాటు చేసుకున్న బ్యానర్స్, ఫ్లెక్సీలను ఉద్దేశపూర్వకంగా తొలగిస్తున్నారని బంజారాహిల్స్ డివిజన్‌కు చెందిన ధనరాజ్ రాథోడ్ ఆరోపించారు. కాంగ్రెస్ కార్యకర్తలు వేసుకున్న ఫ్లెక్సీలపై చిన్నచూపేలా అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం ఫొటోలు ఉన్న బ్యానర్స్ తీస్తున్నప్పుడు, నగర మేయర్ ఉన్న ఫ్లెక్సీలను ఎందుకు తొలగించడం లే దో స్పష్టం చేయాలన్నారు. జీహెచ్ఎంసీ కమిషనర్ అందరికీ ఒకే న్యాయం ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

అక్రమ అరెస్టులతో ప్రజా ఉద్యమాన్ని ఆపలేరు

జిల్లా ఏఐటీయూసీ ఉపాధ్యక్షుడు మల్లేశ్

మణికొండ, జూలై 30: అక్రమ అరెస్టులతో ప్రజా సమస్యల పోరాటాన్ని ఎవరు ఆపలేరని జిల్లా ఏఐటీయూసీ ఉపాధ్యక్షుడు ఎస్.మల్లేశ్ ముదిరాజ్ అన్నారు. రాష్ట్రంలోని మున్సిపల్ కార్మికుల హక్కులను కాలరాస్తున్న తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా చేపట్టాల్సిన పోరాటాన్ని అడ్డుకునేందుకు ప్రభుత్వం అక్రమ అరెస్టులకు పాల్పడుతుందని మంగళవారం ఆయన నార్సింగిలో తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మున్సిపల్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని రాష్ట్ర ఏఐటీయూసీ చేపట్టిన ధర్నా కార్యక్రమానికి తరలివెళ్లేందుకు సిద్ధమైన నాయకుల్ని ముందస్తుగానే పోలీసులు హౌస్ అరెస్టు చేయడం సమంజసం కాదన్నారు. మణికొండ, నార్సింగి, బండ్లగూడ మున్సిపల్ కార్పొరేషన్‌లో పనిచేస్తున్న కార్మికుల హక్కుల సాధన కోసమే ఏఐటీయూసీ నిరంతర పోరాటం చేస్తుందని అన్నారు. నిజంగా ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్న ప్రభుత్వం అయితే ఆందోళన చేస్తున్న తమ హక్కులకు ఎందుకు న్యాయం చేయడం లేదని ఆయన ప్రశ్నించారు. ప్రభుత్వాలు మారుతున్నా కార్మికుల కష్టాలు మాత్రం అలాగే ఉన్నాయని, ప్రజా సమస్యలు పరిష్కరిస్తామంటూ కల్లబొల్లి మాటలు చెప్పి గద్దెనెక్కిన రేవంత్ సర్కార్ ఇప్పుడు మాట మార్చి కార్మికుల హక్కులను కాలరాస్తుందని అన్నారు. మున్సిపాలిటీ, గ్రామ పంచాయతీలలో విధులు నిర్వహిస్తున్న కార్మికుల హక్కుల సాధన కోసం ఏఐటీయూసీ ఎల్లప్పుడూ పోరాటాన్ని కొనసాగిస్తూనే ఉంటుందని ఆయన అన్నారు. ధర్నా చేసేందుకు అన్ని అనుమతులు పోలీసుశాఖ ముందస్తుగా ఇచ్చినప్పటికి అక్రమంగా నార్సింగి పోలీసులు అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌లో నిర్బంధించడం దారుణమని అన్నారు. త్వరలోనే కార్మిక సంఘాలతో కలిసి పెద్ద ఎత్తున ధర్నాకు పిలుపునిస్తామని ఈ సందర్భంగా ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు శంకర్, అంజయ్య, బషీర్ తదితరులు పాల్గొన్నారు.

నార్సింగి స్టేషన్‌లో జిల్లా ఏఐటీయూసీ ఉపాధ్యక్షుడు మల్లేశ్‌ముదిరాజ్

ఉద్యమాలపై ప్రభుత్వం అణిచివేత ధోరణి ..

హిమాయత్‌నగర్, జూలై 30: రాష్ట్రంలోని పలు రంగాల్లో పనిచేసే సంఘటిత, అసంఘటిత కార్మికులు తమ హక్కుల సాధన కోసం ఉద్యమాలు చేస్తుంటే వాటిని అణచివేసే ధోరణిలను ప్రభుత్వం అవలంభిస్తుందని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాల్‌రాజ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న సందర్భంలో తమ సమస్యలను పరిష్కారం చేయాలని కోరుతూ కార్మికులు ఇందిరా పార్కు వద్ద నిరసన చేసుకునేందుకు అనుమతి ఉండేదని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత నియంత పాలన సాగుతుందని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి రా జ్యాంగ హక్కును, ప్రజాస్వామ్యంను తుంగలో తొక్కుతున్నారని విమర్శించారు. ఇప్పటి వరకు కార్మికులు అనుభవిస్తున్న చట్టాలు, హక్కుల అమలు అనేక పోరాటాలతోనే సాకారమం అయ్యాయని తెలిపారు. ప్రజలు, కార్మికుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోకపోతే కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజలు పాతరవేయడం ఖాయమన్నారు.

ప్రజలకు నిరంతరం విద్యుత్ అందించడమే లక్ష్యం

ట్రాన్స్‌కో సీఎండీ ముషారఫ్ ఫారుఖీ

శంషాబాద్ రూరల్, జూలై 30 : ప్రజలకు నిరంతరం విద్యు త్ అందించడమే లక్ష్యమని ట్రా న్స్‌కో సీఎండీ ముషారఫ్ ఫారు ఖీ తెలిపారు. మంగళవారం శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని ధర్మసాయి సబ్‌స్టేషన్ వద్ద 5 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు నిరంతరం విద్యుత్ అందించడమే లక్ష్యంగా ట్రాన్స్ కో పని చేస్తుందని వివరించారు. లోఓల్టేజీ ఎక్కడ ఉన్నా అక్కడ మరో ట్రాన్స్‌ఫార్మర్ల్ ఏర్పాటు చేస్తామని వివరించారు. ప్రజలకు విద్యుత్ సమస్య లేకుండా ఎప్పటికప్పుడు అధికారులు, సిబ్బంది పని చేస్తుంటారని తెలిపారు. 24 గంటల నిరంతర విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు చెప్పారు. వేసవికాలంలో సైతం రికార్డు స్థాయిలో విద్యుత్ సరఫరా చేశా మన్నారు. వ్యవసాయం, గృహాలతో పాటు పరిశ్రమలకు నిరంతరం విద్యుత్ అందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం సబ్‌స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో చీఫ్ ఇంజినీర్ అన్నాఫ్, ఎస్ఈ గోపయ్య, డీఈ రత్నకర్, ఏఈ షేక్‌బాషాలతో పాటు పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ కండక్టర్‌పై యువకుల దాడి

ఖైరతాబాద్, జూలై 30 : ఫుట్ బోర్డుపై ప్రయాణించవద్దని అన్నందుకు ఓ కండక్టర్‌పై కొందరు యువకులు దాడి చేసి కొట్టారు. పంజాగుట్ట పోలీసుల వివరాల ప్రకారం... జగద్గిరిగుట్ట నుంచి మెహిదీపట్నంకు వెళ్తున్న ఆర్టీ బస్సు(19కే/జే)లో పంజాగుట్ట స్టేజీ వద్ద కొందరు యువకులు ఫుట్‌బోర్డుపై నిలబడి ఉన్నారు. దీంతో కండక్టర్ వారిని వెంటనే పైకి రావాలని చెప్పాడు. ఆగ్రహించిన ముగ్గురు యువకులు కండక్టర్‌పై దాడిచేసి కొట్టారు. దీంతో ముక్కుకు తీవ్రంగాగాయమైంది. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

నాలాల పరిశుభ్రతకు ప్రత్యేక చర్యలు

మణికొండ మున్సిపల్ కమిషనర్ ప్రదీప్‌కుమార్

మణికొండ, జూలై 30: ప్రజలు నాలాల్లో చెత్తాచెదారాలు, వ్యర్థాలను పారవేయడం ద్వారా అవి పూర్తిగా పేరుకుపోయి అనేక ఇబ్బందులు సృష్టిస్తాయని మణికొండ మున్సిపాలిటీ కమిషనర్ డి.ప్రదీప్‌కుమార్ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని కాంటినెంటల్ హాస్పిటల్ బ్యాక్ సైడ్(టీజీఐఐసీ) నుంచి కోకాపేట్ ఎగ్జిట్ వైపు గల మణికొండ మున్సిపాలిటీలోని ఇస్లే ఆఫ్ స్కైయ్ అపార్ట్‌మెంట్ వద్ద గల నాలా పరిశుభ్రత పనులను చేపట్టారు. మంగళవారం ఈ పనులను కమిషనర్ పర్యవేక్షించి సిబ్బంది చేత పేరుకుపోయిన చెత్తాచెదారాలు, రాళ్లు, వ్యర్థాలను తొలగించి శుభ్రం చేయించారు. అదే విధంగా దోమల నివారణకు ఆయిల్ బాల్స్ వేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు అనాలోచిత నిర్ణయాలవల్ల నాలాలు దుర్భరంగా మారుతున్నాయన్నారు. స్థానికం ఉండే ప్రజలు నాలాల్లో చెత్తాచెదారాలు, వ్యర్థాలు, రాళ్లను డంప్ చేస్తున్నారన్నారు. దీని కారణంగా పూర్తిగా నిండుకొని వరదనీరు, డ్రైనేజీనీరు వెళ్లలేని స్థితి ఏర్పడుతుందన్నారు. భారీ వర్షాలు కురిసిన సమయాల్లో వరదనీరు వెళ్లలేక నాలా పరివాహక ప్రాంతాల్లో ఉన్న ఇళ్లలోకి వరదనీరు చేరుతుందన్నారు. వర్షాకాలం నేపథ్యంలో ఈ సమస్య ఉత్పన్నం కాకుండా నాలాల పరిశుభ్రత పనులను వేగవంతంగా పూర్తి చేస్తున్నామన్నారు. అలాగే దోమల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. దోమలు వృద్ధి చెందకుండా నాలాల్లో ఆయిల్ బాల్స్ వేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఏఈ సంజయ్, ఈఈ సంప త్, మున్సిపల్ అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నాలా పరిశుభ్రత పనులను పరిశీలిస్తున్న మణికొండ మున్సిపాలిటీ కమిషనర్ ప్రదీప్‌కుమార్, తదితరులు

బాస్కెట్‌బాల్ పోటీలో ఎంజీఎం విద్యార్థికి గోల్డ్ మెడల్